క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక కొత్తధర్మపురిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో పలు సమస్యలు కమిషన్ దృష్టికి వచ్చాయని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పిల్లల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా ఉంచాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు గుడ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పతివాడ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో పౌర్ణమి పూజలు



కామాక్షి అమ్మవారి సన్నిధిలో హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న ఉమా సదాశివాలయంలో పౌర్ణమి పూజలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం సహస్ర నామావళి స్తోత్రాలను పఠించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

విజయనగరం పూల్‌బాగ్: మహారాజా లా కళాశాల కొనసాగించాలని కోరుతూ శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘ అధ్యక్షుడు వి. రామచంద్రరావు, కార్యదర్శి రెడ్డి శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లాలో ఉన్న ఏకైక లా కళాశాలను ఎత్తివేసేందుకు ప్రయత్నం జరుగుతుందని.. అందులో భాగంగానే 2023లో జరుగుతున్న అడ్మిషన్ల లిస్ట్ నుంచి ఎంఆర్ లా కాలేజీని తొలగించారన్నారు. జిల్లాలో 36 ఏళ్లుగా కొనసాగుతున్న ఎంఆర్ లా కళాశాల కనుమరుగయ్యే ప్రమాదముందని తెలిపారు. లా కళాశాలను ప్రభుత్వమే కొనసాగించేలా డిమాండ్‌తో స్థానిక కోట వెనుకభాగం శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజా సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ



పౌష్టికాహార కిట్లతో లబ్ధిదారులు, రేగాన, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ రాంబార్కి రామలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు భారతి, సంతోషి, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగశాలల నిర్వహణ భేష్..



సెంచూరియన్‌లో త్రీడీ ల్యాబ్ పనితీరును పరిశీలిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరాజు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ యూనివర్సిటీలో ప్రయోగశాలల నిర్వహణ బాగుందని జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరాజు అన్నారు. మండలంలోని టెక్కలిలో గల సెంచూరియన్ వర్సిటీ శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన ఏఆర్‌వీఆర్, త్రీడీ ప్రింటర్లు, ఇన్‌స్టా యాప్, తదితర వాటిని అభివృద్ధి చేయడంపై వర్సిటీ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ పీఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ పాల్గొన్నారు.

నేడు దేవానందుల స్వామి ఆరాధనోత్సవం

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో దేవానందుల స్వామి 23వ ఆరాధనోత్సవాలను శనివారం నిర్వహించన్నుట్లు నిర్వాకులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అహోబిల రామానుజ జీయర్ స్వామి పాల్గొనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆశ్రమం ఆవరణంలో ధ్వజారోహణం, నగర సంకీర్తనతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జగన్ పాలనపై సంపూర్ణ విశ్వాసం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలకు విశ్వాసముందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 1వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన కోలగట్ల గడిచిన మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో ఇంటికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో ఉన్న బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలపై ఆరా తీశారు. ఈ సమయంలో ప్రజలందరూ తమకు సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయని ముక్తకంఠంతో చెప్పారు. అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడిచిన మూడున్నరేళ్లుగా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడంతో పాటు సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి దేశంలో మొట్టమొదటి సారిగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దే అందుతుండడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నిరంతరం శ్రమిస్తూ నగరాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. డివిజన్ నాయకుడు మచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఎమ్మెల్యే కోలగట్ల ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వజ్రపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై హర్షాతిరేకాలు

విజయనగరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పట్టణంలోని 12వ డివిజన్ బూడివీధిలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకతీతంగా, అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి, బొంగ భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



బూడివీధిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

మాన్సాస్ స్కూళ్లను ప్రభుత్వమే నడిపించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గదుల వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: మాన్సాస్ స్కూళ్లు, కాలేజీలను ప్రభుత్వమే నడిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గదుల వెంకటరావు కోరారు. స్థానిక కోరాడవీధిలోని సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎంతో ప్రతిష్టాత్మమైన విజయనగరం సంస్థాన ఆధీనంలో ఉన్న ఐటీఐ, మహిళా కళాశాల మూతపడ్డాయన్నారు. అలాగే లా కాలేజీని కూడా అడ్మిషన్లు లేవనే సాకుతో మూసివేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారని ఆరోపించారు. ఎంతో ఉన్నత ఆశయంతో స్థాపించిన కాలేజీలు మూత దశగా ప్రయాణించడం సిగ్గుచేటన్నారు. మాన్సాస్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం తీసుకుని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్ బోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ రెడ్డి, పందిరి లక్ష్మణ్ రెడ్డి, యువజన నాయకుడు పట్నాలు వెంకటేష్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణ క్రీడలతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ఈశ్వర్ కౌశిక్

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: ఆత్మరక్షణ క్రీడలు దేహదారుఢ్యానికి, సమయస్ఫూర్తికి ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం జిల్లా నాయకుడు జి. ఈశ్వర్ కౌశిక్ అన్నారు. నగరంలోని ఎస్‌సీఎస్ థియేటర్ వెనుక గల ఇన్‌స్పైర్ స్కూల్ ఆవరణలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ నిర్వహణలో విజయనగరానికి చెందిన విన్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోచ్‌ల శిక్షణను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తైక్వాండో క్రీడాకారులు, కోచ్‌లకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. డీవీ చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, కోశాధికారి సలాం, ఉపాధ్యక్షుడు గురుస్వామి, మేనేజర్ మురళీకృష్ణ, రిఫరీ కోదండరామ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

- ఎంపీడీఓ గిరిబాల



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణితో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లల తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండలంలోని తమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నాయన్నారు. కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. అనంతరం సీసీ రహదారి నిర్మాణాన్ని పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అలాగే స్థానిక రైస్‌మిల్లును సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, విద్యార్థులు

విజయనగరం క్రైమ్: విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికిపోతే జీవితాలు సర్వనాశనం అవుతాయని ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. మధుకుమార్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో గంజాయి తాగుతూ కొందరు విద్యార్థులు పోలీసులకు పట్టుబడ్డారని, వారిపై కేసులు కూడా నమోదయ్యాయని గుర్తు చేశారు. అదేవిధంగా డబ్బులకు ఆశపడి డ్రగ్స్ రవాణాకు పాల్పడుతున్న విద్యార్థులు పోలీసులకు పట్టుబడి కఠిన శిక్షలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రవాణాపై టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎస్ఈబీ అధికారి గంగాధరుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం



డెంకాడ: మాట్లాడుతున్న ఎస్ఈబీ ఎస్సై కరుణలత

డెంకాడ: డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా జీవితం నాశనమవుతుందని ఎస్ఈబీ ఎస్సై వీఎల్ కరుణలత అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యవహారంలో అమాయక విద్యార్థులు బలి పశువులవుతున్నారన్నారు. కార్యక్రమంలో విజయనగరం రూరల్ ఎస్ఈబీ సీఐ రామచంద్రకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు బి.హరికుమార్, డి.కృష్ణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాస్క్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్బీసీసీ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

భోగాపురం: కరోనా పొంచి ఉన్నందున ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించి, పరిశుభ్రతను పాటించాలని జిల్లా సామాజిక, పరివర్తన (ఎస్బీసీసీ) జిల్లా సమాచార సమన్వయ అధికారి బి.రామకృష్ణ సూచించారు. మండలంలోని మహరాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కరోనా జాగ్రత్తలు, రక్తహీనత, పౌష్టికాహారం, మంచి అలవాట్లు, తదితర అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు

బొండపల్లి: మండలంలోని బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎస్సై బి.సింహాచలంతో పాటు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భారతి ఆస్పత్రిలోని వివిధ విభాగాల రికార్డులు, మందులు నిల్వలను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, ఆర్.అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం

బొండపల్లి: వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో బొండపల్లి మండలం జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. చిట్టిగురువులు కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసినందుకు ఎంపీడీఓ ఎ.వేదవతి జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్ల చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, మండల పరిషత్ సిబ్బంది శుక్రవారం ఎంపీడీఓను ఘనంగా సత్కరించారు. మండల వ్యాప్తంగా 3200 మంది వయోజనులు పరీక్షలు రాయగా అందులో 3106 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాచకిండాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గోల్లు సతీష్, సీనియర్ సహాయకులు డి.సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీఓను సత్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు

ఖాళీ స్థలాలకు పన్ను విధింపుపై కార్యాచరణ



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాముల నాయుడు

విజయనగరం: నగరంలోని ఖాళీగా ఉన్న స్థలాలపై పన్ను విధింపునకై ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ సమావేశ మందిరంలో వార్డు కార్యదర్శులు, ఆర్ఐలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఖాళీ స్థలాలకు పన్ను విధింపు ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. పన్ను విధింపు చేపట్టిన 72 గంటలలో ప్రొసీడింగ్ పత్రాలను అందించనున్నామని చెప్పారు. ఇందుకోసం కార్యాలయం మొదటి అంతస్తులు నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాల పన్ను విధింపుకై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు జిరాక్స్ కాపీలు, ఈసీ, ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువీకరణ, 250 రూపాయల చలానా (నగరపాలక సంస్థ కార్యాలయంలోనే పొందవచ్చును) అందజేయాలని తెలిపారు. పత్రాలు సమర్పించిన 72 గంటలలో ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తామన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఈఈ కె. శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, హౌసింగ్ డీఈ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకూడదు..



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయనగరం ఏడీఏ నాగభూషణం

డెంకాడ: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని వ్యవసాయ శాఖ ఏడీఏలు ఎ. నాగభూషణం, అన్నపూర్ణ అన్నారు. మండలంలోని పినతాడివాడ సచివాలయంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. రైతులు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చుంనాయుడు, తదితరులు మాట్లాడుతూ, ఆర్‌బీకేల వద్ద గోనెలు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చిరిగిన గోన్లు ఎక్కువగా వస్తున్నాయని, వీటితో ధాన్యం పట్టడం ఇబ్బందిగా మారుతోందని చెప్పారు. అలాగే అందుబాటులో ఉన్న మిల్లులు కాకుండా దూరంగా ఉన్న మిల్లులను కేటాయించడం వల్ల రవాణాకు ఇబ్బంది ఏర్పడుతోందని తెలిపారు. దీనికి ఏడీఏలు నాగభూషణం, అన్నపూర్ణ స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ పూడి నిర్మల, వ్యవసాయ సహాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో ఫ్లెక్సీల తొలగింపు



విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. పలువురు ప్రయాణికుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. విజయనగరం-పాలకొండ, చీపురుపల్లి-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభాలకు పలు రాజకీయ పార్టీలు, వాణిజ్య, వ్యాపార ప్రకటనలకు సంబంధించిన ఫ్లెక్సీలను కట్టడంతో రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలువురు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వెంటనే స్పందించి ఫ్లెక్సీలను తొలగించారు. ఇక మీదట పట్టణంలోని విద్యుత్ స్తంభాలకు ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ స్వామినాయుడు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ రూపొందించిన క్యాలెండర్-2023, వార్షిక డైరీలను వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు శుక్రవారం స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో యూనివర్సిటీ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేందుకు అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు, యూనివర్సిటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

- ఎస్ఈబీ సహాయ సూపరింటెండెంట్ డి.శైలజారాణి

కొత్తవలస: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సహాయ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజారాణి అన్నారు. ఎస్ఈబీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతా మేలుకో, భవితను మలుచుకో.. డ్రగ్స్ వదులుకో.. డ్రగ్స్ రహిత సమాజం- సంక్షేమానికి సంకేతం అంటూ ప్లేకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం శైలజారాణి మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిసై నిండుజీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. గంజాయి, హాషిష్, కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్‌ను మీ పరిసర ప్రాంతాల్లోను, విద్యా సంస్థలల్లో వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే 14500 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ సీహెచ్.రాజేశ్వరి, ఎస్ఐ పి.నరేంద్రకుమార్, స్థానిక ఎస్ఐ బి.దేవి, ఎస్ఈబీ సిబ్బంది, భారత్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.